వాహనాల డీజిల్‌లోనూ కక్కుర్తే!

- వాడిన దానికన్నా ఎక్కువ కూపన్లు తీసుకోవడం
- ఆపై అదే బంకుల్లో సొమ్ము చేసుకోవడం
- సిబ్బంది నిర్వాకం
- కార్పొరేషన్‌కు నష్టం
- చెత్త తరలింపు వాహన సిబ్బంది రగడతో బయటకొచ్చిన విషయం



చెత్తను తరలిస్తున్న ట్రాక్టర్



ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ పరిధిలో చెత్తను తరలించే ట్రాక్టర్లకు వాడే డీజిల్ ఆయిల్‌లోనూ సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. అవసరానికి మించి ఆయిల్ కొట్టించి ఆ తర్వాత సొమ్ము చేసుకుంటున్నారే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చాలా కాలంగా గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న ఈ విషయం తాజాగా చెత్త ట్రాక్టర్ల డ్రైవర్లు రెండు గ్రూపులుగా విడిపోవడంతో పంపకాల్లో తేడాలు వచ్చి బయటకు వచ్చింది. ఈ పంచాయితీ నగరపాలక సంస్థ కమిషనర్ వద్దకు వెళ్లడంతో ఆయన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ డిప్యూటీ కమిషనర్‌కు అప్పగించారు.

21 చెత్త ట్రాక్టర్లు

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో గతంలో 17 చెత్త తరలించే ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఉండేవి. తాజాగా మరో నాలుగు ట్రాక్టర్లను కార్పొరేషన్ కొనుగోలు చేసింది. దీంతో నగరంలోని 50 డివిజన్లలో చెత్తను పోణంగి డంపింగ్ యార్డుకు తరలించేందుకు మొత్తం 21 ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయి. డంపింగ్ యార్డుకు తరలించేందుకు ట్రిప్పుకు మూడు లీటర్లు ఆయిల్ ఖర్చు అవుతుందని ఆ మేరకు కూపన్లు అధికారులు ఇస్తున్నారు. అయితే ఒక్కో ట్రాక్టర్ ద్వారా రోజుకు అవసరాన్ని బట్టి రెండు నుంచి మూడు ట్రిప్పులు ఒక్కో వాహనం వేస్తుంది. దీనంతటిని కార్పొరేషన్ ఏఈ పర్యవేక్షణలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మోనిటరింగ్ చేస్తుంటారు. వీరిద్దరు ద్వారానే ఆయిల్ కూపన్లు వాహనాల డ్రైవర్లకు ఇస్తుంటారు.

ట్రిప్పుల్లో లొల్లి.. వాడకంలో మతలబు

చెత్త వాహనాల ట్రిప్పుల్లో లొల్లి జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో వాహనం రోజులో ఒకే ట్రిప్పు వేసినా మూడు ట్రిప్పులు వేసినట్లుగా నమోదు చేయించుకోవడం. ఒక ట్రిప్పులో వాడాల్సిన ఆయిల్ మూడు లీటర్లకన్నా అధికంగా అయినట్టు చూపడం లాంటి జిమ్మిక్కులతో ప్రతి రోజూ అదనంగా డీజిల్ ఖర్చయినట్టు చూపుతూ సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. సాధారణంగా కార్పొరేషన్ పరిధిలోని చెత్త తరలించే వాహనాలకు ఏలూరు నగరంలోని రెండు పెట్రోల్ బంకుల్లో డీజిల్ కొట్టిస్తున్నారు. అదనంగా రాయించుకున్న డీజిల్‌ను అదే బంకుల్లో అయినకాడికి విక్రయించేసుకుని సొమ్ములు వాటాలుగా పంచుకుంటున్నారని, ఈ వాటాల్లో వచ్చిన తేడాలే విషయం బయటకు పొక్కిందని చెబుతున్నారు. డీజిల్‌ను మాయ చేసి జేబులు నింపుకోవడం పట్ల నగర ప్రజలు విస్తు పోతున్నారు. ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేసి వాస్తవమని తేలితే సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిందిగా నగర ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సొమ్ము దుర్వినియోగం



ఎంతో విలువైన ప్రజలకు చెందిన సొమ్ములను కార్పొరేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది ఈ విధంగా దుర్వినియోగం చేయడం బాధాకరం. చివరికి చెత్త వాహనాల డీజిల్‌లోనూ కక్కుర్తి పడటం విచారకరం. దీనికి కారకులైన వారిపై అవసరమైన చర్యలను అధికారులు తీసుకోవాలి.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

సిగ్గుచేటు



చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే వాహనాల డీజిల్ పేరుతో స్వాహా చేయడం అత్యంత నీచం. సిగ్గు చేటు. బడా బాబులు పెద్ద వాటికి ఎసరు పెడుతుంటే చిన్నాచితక ఉద్యోగులు అయినకాడికి నొక్కే ఇటువంటి పనులు చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని సరి చేయాలి.

– బి.నాగరాజు, ఏలూరు

క్లుప్తంగా

22 నుంచి దసరా మహోత్సవాలు



కరపత్రం విడుదల చేసిన ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈనెల 22 నుంచి స్థానిక పత్తేబాదలోని శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పృథ్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. గురువారం ఉదయం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పందిరి రాట పాతారు. వచ్చే నెల 2 వరకు నిర్వహించే శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రతి నిత్యం విశేష అలంకరణలు, ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాటు చేశామని మూర్తి తెలిపారు. అనంతరం ఉత్సవాల కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నాయుడు శారద సోము దంపతులు, అర్చక స్వామి ప్రయాగ వెంకట రామమూర్తి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి రాకేష్‌కు పరామర్శ



విద్యార్థి రాకేష్‌ను పరామర్శిస్తున్న సందీప్

ఏలూరు (టూటౌన్): శింగగూడెం పంచాయతీ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న తిరుమలశెట్టి రాకేష్ తాపీ పనికి వెళ్లి ఇంటి నిర్మాణం చేస్తుండగా 11 కేవీ విద్యుత్ వైర్లు చేతికి తగలడంతో షాక్‌కు గురై తీవ్ర అస్వస్థతతో ఏలూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. రాకేష్‌ను గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు సొంగా సందీప్ (లిడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్) హాస్పిటల్‌లో పరామర్శించారు. చికిత్స నిమిత్తం అతనికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ద్వారకాతిరుమల: మండలంలోని గుండుగొలనుకుంటలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని గురువారం సుమారు 50 మంది ఆదివాసీలు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కోసం వీరు తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొమరం భీమ్ నుంచి నాబార్డ్ ఆధ్వర్యంలో వచ్చారు. గ్రామంలోని ఒబిలిశెట్టి గోపాల కృష్ణమూర్తికి చెందిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని పరిశీలించి, పలు అంశాలపై అవగాహన పొందారు. కార్యక్రమంలో ఎస్పీఎంయూ రాథోడ్, నాబార్డ్ పీడీ సతీష్ నిర్మల పాల్గొన్నారు.

విమల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



సభలో మాట్లాడుతున్న రమాదేవి

ఏలూరు (టూటౌన్): అమరజీవి గారపాటి విమల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ రమాదేవి అన్నారు. శనివారం పేట హేలాపురి లైన్స్ ఆడిటోరియంలో సీపీఎం నాయకురాలు గారపాటి విమల సంస్మరణ సభ ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. విమల చిత్రపటానికి రమాదేవి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. విమల ఉపాధ్యాయురాలుగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం పోరాటాల్లో అగ్రభాగా నిలిచే వారిని గుర్తు చేశారు. జిల్లా మహిళా సంఘ కార్యాలయ నిర్మాణంలో విమల పాత్ర మరువలేనిదన్నారు. రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ ఏలూరు ఎమ్మెల్యేగా పనిచేసిన గారపాటి సత్యనారాయణ స్ఫూర్తితో విమల పనిచేశారని అన్నారు. తన మరణానంతరం కూడా భౌతికకాయాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించిన త్యాగశీలిగా నిలిచారన్నారు. నాయకులు పాతూరి రవి, చింతకాయల బాబురావు, ఆర్ లింగరాజు, పీవీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న కుల సంఘం పెద్దలు

ఏలూరు (టూటౌన్): నగరంలో శెట్టిబలిజ కుల సంఘం పెద్దలుగా చెప్పుకునే కొందరు తమను బెదిరిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని చాటపర్రు గ్రామానికి చెందిన బైరెడ్డి విజయ్ కుమార్, మోహనరాణి దంపతులు తెలిపారు. గురువారం ఏలూరులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కలెక్టర్ నిర్వహించిన లాటరీలో బార్ లైసెన్స్ తనకు తగిలిందని, అప్పటి నుంచి తనకు లాటరీ ద్వారా దక్కిన బార్‌ను వదిలి వేయాలంటూ ఏలూరు నగరానికి చెందిన శెట్టిబలిజ కుల పెద్దలు ఒత్తిడి చేయడం ప్రారంభించారన్నారు. తాను శెట్టిబలిజ కులానికి చెందిన వాడిని కాదంటూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారని వాపోయారు. తహసీల్దార్, ఆర్డీఓ విచారించారని, తన వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలను అధికారులకు అందించామని తెలిపారు. కేవలం బార్ తనకు తగిలిందనే అక్కసుతోనే కుల పెద్దలుగా చెప్పుకునే కొందరు తనపై బెదిరింపులకు దిగుతూ మాసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కుల సంఘం నాయకులు తమ తీరును మార్చుకోక పోతే అవసరమైతే న్యాయ పోరాటం చేసేందుకైనా తాను సిద్ధమేనని స్పష్టం చేశారు.

మనసును సంతులనం చేసుకోవాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఆచార్య సింఘు రింపోచే

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యాభ్యాసం సమయంలో ప్రతి విద్యార్థీ మనసును సంతులనం చేసుకోవాలని సింగపూర్‌కు చెందిన థెక్చెన్ చోలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్యాత్మిక దర్శకులు ఆచార్య సింఘు రింపోచే సూచించారు. గురువారం స్థానిక రామచంద్ర అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో ట్రాన్‌క్విల్ మైండ్‌సెట్ అనే అంశంపై విద్యలోనూ, దైనందిన జీవితంలో ఒత్తిడి, మానసిక నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్త రింపోచే మాట్లాడుతూ ఒత్తిడిని జయించడానికి, కష్టసమయాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి విద్యార్థులు మానసికంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. దైనందిన జీవితంలో మైండ్‌ఫుల్‌నెస్ సాధనపై విలువైన మార్గదర్శకాలను అందించారు. కళాశాల చైర్మన్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థులు మానసిక శ్రేయస్సు, కేంద్రీకరణ, ప్రతిఘటనలను పెంపొందించుకునే ప్రాయోగిక సూచనలను పొందారని తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కె.సాయి రోహిత్, ప్రిన్సిపాల్ ఎం మురళీధర రావు, అన్ని శాఖల డీన్లు, అన్ని శాఖల హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్లు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

దెందులూరు: యూరియా, ఎరువుల వాడకంపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివా సరాజు అన్నారు. గురువారం మండలంలోని రామారావుగూడెం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ నత్రజని ఎరువులను నిర్దేశించిన మోతాదు కంటే ఎక్కువగా వాడడం వలన చీడ పీడల ఉధృతి ఎక్కువై పంటకు నష్టం కలుగుతుందని, తద్వారా రైతుకు పెట్టుబడి ఖర్చు పెరిగి, దిగుబడులు తగ్గుతాయన్నారు. క్షేత్ర సందర్శనలో భాగంగా వరి పంటను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు యు.సుందర్ కుమార్, పశు సంవర్ధక శాఖ జేడీఓ పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీఆర్ఆర్ కళాశాలలో ముగిసిన వర్క్‌షాప్



పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేస్తున్న శ్రీనివాస్ రెడ్డి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్, ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశంపై ఈ నెల 9న ప్రారంభమైన వర్క్‌షాప్ గురువారం నాటితో ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో విజయవాడ పీబీ సిద్దార్థ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ ప్రాముఖ్యత, ఉపయోగాలను వివరించారు. ముఖ్యంగా అర్డునో, రాస్ప్ రియాటిక్ అల్ట్రాసోనిక్ సెన్సర్, ఐఆర్ సెన్సర్, టెంపరేచర్ సెన్సర్, ప్రోటెంషియో మీటర్ వంటి పరికరాలపై హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఇచ్చి విద్యార్థుల సందేహాలను వివరించారు. కార్యక్రమంలో మహిళా కళాశాల ఇన్‌చార్జి కరెస్పాండెంట్ వంకినేని భానుప్రకాశ్, ప్రిన్సిపాల్ జి.సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి.హిమబిందు, వైస్ ప్రిన్సిపాల్ కె.ఝాన్సీలక్ష్మి, కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ కేవీవీ శ్రీనివాస్, ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ వై.శ్రీదేవి, ఉపాధ్యాయులు, డిగ్రీ కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాలు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేపల పెంపకంపై శిక్షణ

ఏలూరు (టూటౌన్): స్థానిక మత్స్యశాఖ, ఆక్వా లాబ్, శిక్షణ కేంద్రంలో సర్ సీఆర్‌రెడ్డి (ఆటోనమస్) కాలేజీ బీఎస్సీ ఆక్వాకల్చర్ రెండు, మూడో సంవత్సరం విద్యార్థులకు రెండు రోజులు (10, 11 తేదీలు) నైపుణ్య అభివృద్ధి శిక్షణలో భాగంగా ఆక్వలాబ్‌లో నీరు, మట్టి, మేత, మైక్రోబయాలజీ, పీసీఆర్ పరీక్షలపై శిక్షణ, ఏలూరు మత్స్య క్షేత్రంలో చేపల పెంపకంపై క్షేత్ర సందర్శన, ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి 42 మంది విద్యార్థులు హాజరయ్యారు. కోర్సు డైరెక్టర్‌గా జిల్లా మత్స్య శాఖ అధికారి బి.నరసయ్య వ్యవహరించారు. కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం వెంకటరామన్నగుడెం, శాస్త్రవేత్త ఎ.దేవి వరప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి.రాజ్ కుమార్ నేతృత్వంలో మత్స్య శాఖ అభివృద్ధి అధికారులు ఎ.సతీష్ కుమార్, ఎం భవిత శిక్షణా తరగతులు నిర్వహించారు.

వాహనచోదకులకు జరిమానా



వాహన తనిఖీ చేస్తున్న ఎస్సై నాగబాబు

దెందులూరు: ప్రతి వాహనానికీ అన్ని రకాల అనుమతి పత్రాలు ఉండాలని ఏలూరు రూరల్ మండల ఎస్సై నాగబాబు అన్నారు. గురువారం సాయంత్రం ఏలూరు రూరల్ మండలం మార్కెట్ యార్డ్ వద్ద ద్విచక్ర వాహనాల అనుమతి పత్రాలు, హెల్మెట్లను తనిఖీ నిర్వహించారు. అనుమతి పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	38	బీన్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	20	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	54	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	38
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	76-96
క్యారెట్	42	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	38	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	15	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	26-30	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	36
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	33
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

గాంధీబాబు కార్నియాల సేకరణ



ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీ సత్య సాయి సేవా సమితి ఏలూరు సభ్యుడు గాంధీ బాబు గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. విజయవాడ ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ ప్రతినిధులు ఆయన నేత్రాల నుంచి కార్నియాలు సేకరించారు. గాంధీబాబు శ్రీ సత్యసాయి జిల్లా అధ్యయన మండలి ఇన్‌చార్జిగా, ప్రశాంతి సేవలు, డెకరేషన్ టీం, ఏలూరు సత్యసాయి సేవా సంస్థలో నగర సంకీర్తన, భజనలు, సత్సంగాలు, గ్రామ సేవలలో పాల్గొంటూ విశేషమైన సేవలు అందించారని సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశి శేఖర రావు తెలిపారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు, కుండీలు అందిస్తున్న ప్రకాష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రకృతిలో సంభవించే వైపరీత్యాలకు పర్యావరణ అసమతౌల్యతే ప్రధాన కారణమని, పర్యావరణ సమతుల్యతకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని జాలిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భంగా తిమ్మాపురం మోడల్ ప్రైమరీ స్కూల్ పాఠశాల ఉపాధ్యాయుడు డీకేఎస్ఎస్ ప్రకాష్ జాలిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మొక్కలు, పూల కుండీలను అశోక్ కుమార్, పీఎస్ హెచ్‌ఎం జి.మోహన్‌లకు అందజేశారు.

నిమ్మ సాగును ప్రోత్సహించండి

దెందులూరు: మెట్ట గ్రామాల్లో నిమ్మ సాగును రైతులు ప్రోత్సహించాలని జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీఓ ఫాతిమా ప్రసన్న అన్నారు. గురువారం మేధినరావుపాలెం గ్రామంలో నిమ్మ సాగు మొక్కలను పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎకరాకు రూ.1,46, 311 మూడు సంవత్సరాల నిర్వహణ నిమిత్తం జాతీయ ఉపాధి హామీ పథకం రైతు అకౌంట్‌కు నగదు జమ చేస్తారన్నారు. మెట్ట ప్రాంత గ్రామాల్లో రైతులు నిమ్మ సాగుకు ఉపాధి హామీ పథకం తోడ్పాటు అందిస్తున్న నగదును సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలని ఆమె కోరారు.

రోడ్ల నిర్మాణం చేపట్టాలని ధర్నా



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నేతలు

జంగారెడ్డిగూడెం: పాడైపోయిన రోడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కొత్త రోడ్లలో జరుగుతున్న అవినీతిని అరికట్టి దోషులపై చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నాయకులు కేవీ రమణ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో ముఖ్యంగా జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం, బుట్టాయిగూడెం, చింతలపూడి, లక్కవరం ప్రాంతాలకూ వెళ్లే రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయన్నారు. జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కి వెళ్లే ఏలూరు రోడ్డు కూడా గోతులతో ఉండి ప్రయాణం అంటేనే భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు సరియం రామ్మోహన్, ఏఐకేఎంఎస్ నాయకులు భూషణం, పీవైఎల్ నాయకులు తగరం బాబూరావు, పీవైఎల్ నాయకులు కెచ్చెల పోతిరెడ్డి, గోగుల పండు, పీడీఎస్‌యూ నాయకులు కె.నాని, బన్నే వినోద్, పీఓడబ్ల్యూ నాయకులు శ్రావణి, కె.రామలక్ష్మి, ఐఎఫ్‌టీయూ నాయకులు మరపట్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులతో క్యాన్సర్

నిడమర్రు: పొగాకు ఉత్పత్తుల వినియోగం వలన క్యాన్సర్ బారిన పడి విలువైన జీవితాన్ని కోల్పోతామని అందువలన పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని డైట్ అధ్యాపకుడు చల్లా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఆయన బువ్వనపల్లిలోని ఉన్నత పాఠశాల, ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, పలు తరగతుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పొగాకు ఉత్పత్తుల వలన జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యా సంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తులు, ఖైనీ, గుట్కా వంటి క్యాన్సర్ కారక ఉత్పత్తులు అమ్మడం నిషేధమని, వీటిని అమ్మొద్దని సమీప వ్యాపారులకు నోటీసులు అందజేశారు. పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎన్వీ సుబ్బారావు, ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ భారతీలక్ష్మీకుమారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలి

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాల గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీఓ ఎం.రాజు అధికారులను ఆదేశించారు. గూటాలలో పారిశుద్ధ్య పనులు అధ్వానంగా ఉన్నాయని, పంచాయతీ సిబ్బంది స్పందించడం లేదంటూ జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గూటాల పంచాయతీ వద్ద డీఎల్‌పీఓ, ఎంపీడీఓ శ్రీనివాస్, ఈవోపీఆర్‌డీ రవికుమార్ గురువారం గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు మార్చుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. తాగునీరు కలుషితం అవుతోందని, డ్రెయిన్ల పూడిక తీయడం లేదని, వీధి లైట్లు వెలగడం లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE :: MEDCHAL-MALKAJGIRI DISTRICT :: AT MEDCHAL
O.S.NO.526 OF 2024

BETWEEN:
Jajula Gangadhar ...PLAINTIFF
AND
Khaja Seenu ...DEFENDENT

To
1. Khaja Seenu S/o Rama Rao, Occ: Business, R/o Nekkalam Goillagidem, Agiripalli Mandal, Krishna Dist., Andhra Pradesh- 521212.

Please take the notice that you the above-named **Khaja Seenu** you are hereby informed that **Jajula Gangadhar** had filed the above OSagainst you for recovery of money.
The present OSstands posted on 06-10-2025 before the Hon'ble Prl. Junior Civil Judge, Medchal- Malkajgiri Dist., At Medchal for your Appearance. You are hereby directed to appear in this court in person or by a pleader duly instructed on the 06th day of October, 2025 at 10.30 O' clock before the above court i.e., Hon'ble Prl. Junior Civil Judge, Medchal - Malkajgiri, At Medchal and submit your grievances.

//by order of the court//
Sd/- (M/s. G Shanti), Advocate
Kukatpally, Hyderabad - 500 085
COUNSEL FOR PLAINTIFF